# బిగిసిన పిడికిళ్ళు



సరిపల్లి కృష్ణారెడ్డి

రెండు మూడు రోజుల్నుంచి సన్నగా వర్షం కురుస్తుండటంమూలాన గుట్టమీద గడ్డి పచ్చబడింది. గుట్టమీదున్న రేగు చెట్లు కూడా పచ్చగా తోస్తున్నాయి. మోదుగపూలు మరింత రక్తవర్ణాన్ని విరజిమ్ముతున్నాయి. అడివంతా చిత్తడిగా వుండడం మూలాన నడవడం కష్టంగానే వుంది.

గుట్ట దిగువన సన్నగా పారుతున్న వాగు వాగుప్రక్క రాయిమీద గొంగడి కప్పుకొని కూర్చున్న దొర జీతగాడు మల్లిగాడు కొంత దూరంలో గుంపులుగా మూగి నేలంతా చిత్తడి-చిత్తడి చేస్తూ పచ్చబడిన గడ్డిని పళ్ళతో పట్టేందుకు యత్నిస్తున్నాయి దొరవారి పశువులు

పొద్దస్తమానం దొర చాకిరితోనే జీవితమంతా గడిపాడు మల్లిగాడు. దొర మెచ్చుకుంటే చాలు పొంగిపోతాడు. దొర మెప్పు పొందేందుకు పనికిరాని ప్రతిదాని జాడా తీస్తుంటాడు. నలభై ఏళ్ళ మల్లిగాడు ఏమీ తినకపోయినా ఏనుగులా వుంటాడు. జానెడు మీసాలతో చిన్న మొహంతో చురుకు

చూపులు. మబ్బుపట్టిన ఆకాశంలోంచి బయటికోసారి తొంగిచూసిన సూర్యుని ఎర్రని కిరణాలు అతని మొహంపై బడి చురుక్కుమనిపించాయి.

సంజె వెలుగులు దగ్గర పడుతుంటె పశువుల్ని తోలుకొని దొర గడీకి బయలుదేరాడు. అక్కడక్కడ చిక్కగా అల్లుకున్న మైదాకుచెట్ల పూలు ఘాటువాసనను కలిగిస్తున్నాయి. వాసన పీలుస్తుంటే గిలిగింతలు పెడుతున్నట్లుగా వుంది.

కొంతదూరం వచ్చేసరికి తమ గ్రామానికి మైలు దూరంలో వున్న కుక్కల గూడూరు గ్రామపు గొల్ల యాదయ్య కలిశాడు.

“ఏందిరా వారీ!! ఏమో వొంటబోతున్నవు.! మొద్దు ఏంటికటా?” అతని తలపై వున్న తుమ్మ మొద్దుకేసి చూస్తూ అడిగాడు.

“మల్లిగాడు ఎదురు పడితేనే అపశకునమని ఊళ్ళో అందరూ ఎందుకనుకుంటారో? అందర్ని మంచిగనే మాట్లాడిస్తడు” అని మనసులో అనుకున్నాడు గొల్ల యాదయ్య. పైకి మాత్రం “ఏమి లేదు!! మల్లన్న నాగలికోసం మొద్దు కొట్టక పోతున్న!! నెల దినాల్నుంచి అనుకుంటనే ఏదయితె అదాయెని గియ్యాల కొట్టుకొస్తున్న” అంటూ గొడ్డలిని క్రింద వేసి మొద్దును కూడా క్రింద పడవేశాడు.

“నీ యవ్వ! గీ దినాల్ల భయం లేదు భక్తిలేదు.... దొర నడుక్కున్నవా. సప్పుడు జెయ్యక కొట్టుకొస్తున్నవా” అని నడుముకున్న తోలు సంచి తీసి సగం కాల్చిన తునికాకు బీడి తీసి నోట్లో పెట్టుకొని కొంచెం దూది, చెకుముకి రాయి తీసి టపీ - టపీ నాలుగు సార్లు కొట్టి వెలిగించాడు. మండాక బీడిలో పెట్టాడు. గుప్పు - గుప్పున రెండు సార్లు పొగ పీల్చాడు.

“దొర సడిగేదేంది! మంచిగనే వున్నవు! గా చెట్లు దొరయ్యెందుకయితయి! తాతల జమానా కాణ్ణుంచి ఊళ్ళందరు చెట్లు కొట్టుకొస్తుండ్రు. ఏమి లేదుగని గివ్వాళ.... ఏమో! కొత్తగా జెప్పబడితివి. యిసిత్రంగనే వున్నది గిదంత” అని కొర కొర చూపునొకటి మల్లిగాడి మీద కేంద్రీకరించాడు.

“అయిపాయెర వారీ! నేనేమంటి! దొరకిందివాయె....ఏందో ఫర్మానా జారీ అయిందట! గా అడివి గూడ తనదేనని దొర అనంగ నా తెరుకాయె! లేకపోతే నాకేంటికి? ఏడ చెట్లు ఎవరెత్తుకపోతే నాకేంది? గట్లనే దొర కెరుకైతే! మా యిసాబ్ తీస్తడు....” అంటూ యాదయ్య మొహంలోకి లోతుగా చూసి:

“పోయిరా! వారీ!! పసులు మస్తుగ దూరం పోయినయి!” అంటూ ముందుకు సాగిపోయాడు మల్లిగాడు.

ముంచుకువస్తున్న కారుమేఘాలకేసి ఓ చూపు చూసి క్రింద బరువును నెత్తికెత్తుకొని తేనెటీగల్లా మూగే ఆలోచనలను ప్రక్కకుగొడుతూ ముందుకు సాగిపోయాడు యాదిగాడు.

* * *

ఇది జరిగినాక రెండురోజులకు దొర దగ్గర్నుంచి యాదయ్యకు పిలుపొచ్చింది. సుంకరి పోచిగోడు కాలిబాట వెంబడి పరిగెత్తుకొని పరిగెత్తుకొని వచ్చి ఊళ్ళో పెద్ద మనిషి గొల్ల అంకిరిగానికి ఎరిగించాడు. ఈ సంగతిని ఊళ్ళో అందరికీ ఎరిగించి యాదిగాడ్ని సుంకరి వెంబడి పరిగెత్తించాడు గొల్ల అంకిరి.



"ఎన్నడులేంది దొరకేం పనిబడిందో.." యాదయ్య పెండ్లాం రుక్కవ్వ అనుకుంది. అయినా దేవునిమీద భారంవేసి పుస్తేపది సార్లు కళ్ళకద్దుకొని ధైర్యం తెచ్చుకుంది.

సుంకరెంబడి పరిగెత్తుకొచ్చాడు తప్పితే మనసు మనసులో లేకుండాపోయింది యాదయ్యకి.

ఊరి నడుమ ఎత్తుగా నాలుగు దిక్కుల నాలుగు బురుజు ల్లాంటివి బయటి కనపడు తుంటే పెద్ద పాటిక్. పాటిక్ లోపలికి అడుగు బెడుతుంటే సింహపు నోట్లోకి అడుగు బెడుతున్నట్లుగా అనిపించింది.

లోపలికి వెళ్తూనే వసారాలోవున్న పీట మీద దొరవారు తమ శరీరానికి చిన్నగా విశ్రాంతి నిస్తున్నాడు. వెంబడి మనిషినేసు కుని లోనికడుగుబెట్టిన సుంకరిని చూసే సరికి కనుబొమలు ముడిచాడు.

"దండాలు దొరా !: కుక్కల గూడూరు గొల్ల యాదిగాడ్ని వెంబడి పట్టుకొచ్చిన !" వంగి సలాంచేస్తూ అరిచాడు సుంకరి.

"ఆ" అంటూ శబ్దం చేశాడు దొర.

దండం ఎందుకు పెట్టాలనిపించినా చేతు లెత్తి దండంపెట్టాడు గొల్ల యాదిగాడు.

లేచి కూర్చున్నాడు దొర.

ప్రహరిలోపల పెద్ద మైదానంలావున్న ప్రదేశం. పిల్లలకోడి పురుగును పట్టుకొని "కొ! కొ! కొ" అంటూ పురుగును పట్టే పిల్ల లని పిలుస్తుంది.

మబ్బులు పట్టిన ఆకాశమైనా, చినుకులు పడి రెండు రోజులైనా మేఘాల చాటు నుంచి బయటపడుతున్న సూర్యుడు చుర్రు మనిపిస్తున్నాడు.

"ఏమిరా ! లఖ్మీకొడుకా ! యాదిగాడివి నువ్వే లేరా ?"

తిట్టుతోనే దొర తనని సంబోదించేసరికి యాదిగాని మనసుకు కష్టం కలిగింది. అయినా దాన్ని వెలికి పుచ్చలేదు. వినయం గానే "నీ కాల్మొక్త !! బాంచన్ ! నేనే నయ్య !" అన్నాడు. దొర మొహంవేపు పరిశీలనగా చూశాడు.

పొడుగ్గావున్న మనిషి.... పోతే కళ్ళ క్రింద పొట్టలు కమిలిపోయి నల్లబడ్డాయి.


ఏదో అనబోయిన దొరచూపులు గడీ లోపలికి అడుగుబెడుతున్న సుంకరివాడు తీసికొస్తున్న గొర్రెపిల్లపై బడ్డాయి.

రెండు క్షణాలు అటువేపు దృష్టి నిగి డ్చాడు.

"యినాఖిచ్చిండ్రు....గీ పూటకే వండు మంటరా!"- సుంకరి.

గుడ్లురిమి చూశాడు దొర.

అదిరిపోయాడు సుంకరి. ఎర్రబడ్డ దొర




కళ్ళు అదరగొట్టాయి. మొహం నేలకొత్తు కున్నాడు

"గొర్రెను సక్కగ పట్టుకోరో లఖ్మీ కొడుకా!" అంటూ పీట క్రిందున్న కత్తి తీసుకొని గొర్రెను చేరుకున్నాడు.

కొద్దిసేపు గొర్రెవేపు చూశాడు- చిన్నగా నవ్వాడు.

"గట్టిగా పట్టుకోరా!" గట్టిగా అరిచాడు. ఆ అరుపు గడీ మొత్తం అదిరిపోయింది. పాటక్ వద్దనున్న నరాల పోచయ్య గజ్జున వణికాడు.

గట్టిగా పట్టుకున్న గొర్రె చర్మంను మెడ దగ్గర గంటుపెట్టి ఒలుస్తుంటే.... దీనంగా అరుస్తూ.... బలంగా తన్నుకుంటున్న గొర్రెను ఆపడం కష్టంగా వుంది సుంకరికి. అది విదిలిస్తున్న ఊపుకు నెత్తురుచుక్కలు పెదవిమీద పడి ఉప్పగా తగిలింది.

ఎర్రటి రక్తం.... చుక్కలు చుక్కలుగా మొదలయి ధారలు వట్టింది. బ్రతికుండ గానే తోలు ఊడదీసిన దొరను చూస్తుంటే బుగులుగా వుంది గొల్ల యాదయ్యకి.

దొర అలా తోలు దీయడం....సంతోషా నికేనని ఒక్క సుంకరికే తెలుసు.

దొర సైగనందుకొని గొర్రె తీసుకొని బయటికి వెళ్ళిపోయాడు సుంకరి.

"అరేయ్ ! లఖ్మీకొడుకా ! హరామక్ లేక చెబ్తెల్ల గొత్తివిరా ! బోసిడికే ! !"

మాటలు వింటూనే గజ్జున వణికాడు యాదయ్య.

భయంతో నోటి మాటలు రాలేదు. ఉత్త పుణ్యానికే దొర కేకలు వేస్తుంటే.... అదీ అతని పరిధిలోకి రాని చెప్ల విషయంలో,

అందుకే భయం వేసింది.

అయినా ధైర్యం తెచ్చుకున్నాడు. కాళ్ళు అదిమిపట్టాడు.

"నీ కాల్మొక్త!! నేనేమన్న దొంగతనం చేసిన్నా దొరా!! అయిపాయె!! మీ యిలా కల కెల్లి ఎత్తుకుపోతినా?"

ఈ మాటలు వింటూనే దొర మొహం జేవురించుకుపోయింది. "అరె ! మాదర్ చత్ ! గా అడివంత నా కబ్జాలకయింది. ఎరి కేనా ! బోసిడికె ! మల్లగిన మాట్లాడితె నాలుక జీరుత !"

తన తడాఖా తెలిసేందుకు బాగా ఆలో చించాడు-దొర. 'కేక' వేయడంతోనే ఆజానుబాహువు లిద్దరు పరిగెత్తుకొచ్చారు.

"ఈ లఖ్మీ కొడుకును కొట్టం వెయ్యండ్రా !! గంజిలేదు ! గటకలేదు !! రోగం కుదురాలె ! ఒంట్ల పులుసు జారితె గాని దోవకు రాడు."

"నీ బాంచను, కాల్మొక్త! మల్లేమన్న జేస్తే అడుగు దొర" చేతులెత్తి నమస్కారం చేశాడు యాదిగాడు. తన ప్రక్కకు యమ కింకరుల్లా వున్న జీతగాండ్లు.

దొర సైగతో లాక్కవెళ్ళారు జీతగాళ్లు.

* * *

సాయంత్రం వరకు రాకపోయేసరికి యాదయ్య పెండ్లానికి బుగులు నిలువనీయ కుండా చేసింది. ఉండబట్టలేక ఊరిపెద్ద గొల్ల శంకరి దగ్గరకి పోయి ఏడుస్తూ కళ్ళొత్తుకుంది. కాళ్ళమీద బడింది.

"గన్నేండ్ల నుండి కట్టెలు కట్టుకోంగ!! ఎలగ వండ్లు ఏరుకోంగ! చింతపండు కొట్టు కోంగ ఎవ్వలేమనలే!! దొరలు గూడ తుపాకితోని తిరుక్కుంట పిట్టలను కొడు తుంటే!! గప్పుడు లేని కానూన్లు గిప్పుడు ఒస్తున్న యంటున్నరు. గీ కానూన్లు ఉన్నోండ్లు కూకుండి చేస్తేనే కానూను

కావచ్చు." మనసులో అనుకున్నాడు శంకరిగాడు.

ఆడకూతురు ఏడుస్తుంటే తనకూ కడుపు దేవేసినట్లుగా ఉండేసరికి మరో ముగ్గురిని తీసికొని యాదిగాడిపెళ్ళాంతోసహా వాగు దాటి గడీలోకి అడుగుబెట్టాడు.

అప్పటికే సంధ్య వెలుగులు క్రమ్ముకుంటున్నాయి.

జనాల్ని చూసిన జీతగాళ్ళు తమ దొరకి సంగతి నెరిగించారు. దొర కొద్దిసేపయ్యాక బయటికి వచ్చాడు.

అందరూ దొరకో సలాం చేసి గొర్రెల మందలాగా నిలబడ్డారు.

"అయ్యా! మా పొల్లిగాణ్ణి ఎందుకో పిలిపించిరి? ఇప్పుడిదాక జాడ లేకపోతే వస్తిమి"

"నువ్వారా? శంకిరిగా!"

"సిత్తం దొరా!" దొర తన పేరు పలికేసరికి పులికించిపోయాడు.

"ఏమో అంటివేందిరా?"

దొర దగ్గిరికెళ్ళి కాళ్ళు ముట్టుకొని కళ్ళ కద్దుకున్నాడు."మా పిల్లగాడుఏమన్న తప్పు చేస్తే మన్నించాలె బాంచను!!....పొల్లగానికి మొన్ననే లగ్గమయింది....పిల్లేడుస్తుంది.... నీ కాల్మొక్త."

"నిన్న చెట్టుకొట్టిండు....రేపు యిలా కానే కొడుతడు"

అందరూ మరోసారి దొర కాళ్ళమీద పడ్డారు.

"దయ చూపుండ్రి దొర!" అందరి గొంతులు ఏకమయ్యాయి.

దొరనోట్లో మంచి నాణ్యతగల పొగాకు వెలుగుతుంది. దాని వాసన అదిరిపోతూ వుంది.

"అయిపాయె....వానికి చెప్పి తప్పయిపోయిందని కాళ్ళు పట్టుకోమనురా!"

అందరిని కొట్టం వద్దకు తీసికెళ్ళారు జీతగాడు. అతణ్ణి వెంబడించారు తక్కిన వాళ్ళు. పెళ్ళాన్ని చూసేసరికి విలవిల్లాడిపోయాడు యాదిగాడు. తనవాళ్ళు....చుట్టూ తన వాళ్ళు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.


రీటా మీ కేశ సంపద



జుట్టు అద్భుతంగా ఉండేటట్టు చేసేది రీటా. దానిలో అటువంటి శక్తి, సువాసనా ఉన్నాయి - శిరోజాలు సహజంగా, చక్కగా పెరగడానికి, చల్లదనానికి, దానికదే సాటి. రీటా వాడి, మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి. మీ శిరోజాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి నిగనిగలాడుతూ మెత్తగా ఉంటాయి.




స్త్రీలూ పురుషులూ వాడవచ్చును

రీటా

నేడే ఒక సీసా కొనండి
ప్రతిచోటా దొరుకును

ఇప్పుడు సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది.

"అరేయ్! అయిపోయిందేదో అయిపాయె! తప్పయిందని కాళ్ళు పట్టుకుంటే అయిపాయె!"

యాదిగాడు కళ్ళెత్తి శంకరి కళ్ళల్లోకి తీక్షణంగా చూశాడు.

అందరికీ ఆశ్చర్యంగా వుంది.

"నేనేం చేసిన్నని! ఎందుకాళ్ళు పట్టుకోవాలె!"

ఈమాట వింటూనే అందరూ మౌనమైపోయారు. పెళ్ళాం ఎక్కెక్కి పడుతుంది.

శంకరికి కోపం తన్నుకొచ్చింది. "జల్ది తుడిసేద్దమంటే— సమరు తరీఖ చేస్తడు" మనసులో అనుకొని-

"బోసిడికె! ఎట్లరా?"

"నేనేం చేసిన్నని!"

"దొరలతోటి కొట్లాటలు పెట్టుకుంటే.... ఏట్ల కలిసిపోతం! నీ యవ్వ! నీ పెండ్లాముఎన్నది....అయిపాయె నువ్వొక్కనివన్న కాదు."

గడ్డికాడ నోట్లో పెట్టుకొని తల వంచుకున్న యాదయ్య తల ఎత్తలేదు. మాటా మంతీ లేదు.

"ఏమన్న కాని! నీ కాల్మొక్త! నాతోని ఆ పనికాదు. నువు పో....ఎన్ని దినాలుంచుకుంటడో— ఉంచుకోనీ!"

"నీ యవ్వ! పెండ్లాన్ని సూడురా!" అని "రావె! పోరీ! మగనికాడికి" వెనుక నిలబడి వున్న యాదిగాడి పెళ్ళాన్ని పిలిచాడు శంకరి.

గుడ్ల నీరు గుడ్ల కుక్కుకుంటూ నిలబడిపోయింది ఆమె—

తక్కిన వాళ్ళు వీళ్ళద్దర్ని చూడలేక మొహాలు తిప్పుకున్నారు.

శంకరి ఏమనుకున్నాడో కొద్దిసేపు చూసి లేచాడు.

అందరూ అతణ్ణనుసరించారు.

దొర కాళ్ళమీద బడి అలాగే చాలాసేపు వుండిపోయాడు. దొర కాళ్ళు విదిలించుకున్నా. ఒదిలించుకోలేకపోయాడు.

"వాడేడిరా?" దొర నోట్లోంచి ప్రశ్న పెల్లుబికింది.

"నీ కాల్మొక్త! వానికి బుగులయితంది మీ కండ్ల పడాల్నంటే-" దొర ఒక్కసారి అందరివేపు తీక్షణంగా చూశాడు. శంకరిని కాలితో తన్ను తన్నాడు.

అందరి మొహాలు పాలిపోయాయి.

మరి కాసేపాగితే చీకటి పడుతుంది.

దెబ్బతిన్న శంకరి మొహం తుడుచుకొని ముక్కు రుద్దుకున్నాడు.

దొర ఏమనుకున్నాడో? తల వంకించాడు.

దాని అర్థం గ్రహించిన జీతగాళ్ళు యాదిగాడ్ని గుంజుకొచ్చారు.

"ఏమిరా! బోసిడికె!!"

చివుక్కున తలెత్తి చూశాడు యాదయ్య.

"కోపం జల్దిల వస్తదిలేరా! నీకు" అంటూ కొరడా తీసికొని దగ్గరకొచ్చి రెండంటించాడు.

"అయ్యో! నా దేవ!! నా మగణ్ణి సంపుతుండంగ సప్పుడు సేస్తలేరు!" అంటూ అందరివేపు ఓ దృష్టి పారేసి మొగుడిమీద పడింది.

"ఎందుకేడుస్తవే! దొంగతనం చేస్తిమా, లంగతనం చేస్తిమా! బుగులు దేనికి?" పెళ్ళానికి ధైర్యం చెప్పాడు.

పెళ్ళాం జుట్టు ఊడిపోయి విరబోసుకున్నట్లుగా వుంది. ఎక్కెక్కి పడుతుంది.

"నీ పెండ్లాం మంచిగనే వున్నదిరా...." అని ఆమె బుగ్గలు చిదిమాడు దొర.

"నీ దినాలుగాను.... గత్తర రాను ముండకొడుకో!" దొరను తిట్టింది ఆమె.

అందరికీ భయంగా వుంది. కాళ్ళు వణకుతున్నాయి. ముచ్చెమటలు పోశాయి. ఒళ్ళంతా చల్లబడిపోయింది. దొరవి తిడుతుంటే మరీ భయమవుతుంది.


"గంత మాటలనకే పొల్లా...." శంకరి ఆపుకోలేక అన్నాడు.

"పొల్లకు చిట బాగున్నట్లుంది....దొంగ ముండ.... ఆవే!" ఆమె జుట్టు పట్టుకొని కోపంగా లాగాడు దొర.

దీనితో యాదయ్యకు చిర్రెత్తుకొచ్చింది. మనసులో దొర అంటే భయం పోయింది. దాని స్థానంలో కోపం వుంది, వ్యధ ఉంది.

లాగి దొర దవడలు పగులగొట్టాడు.

హఠాత్తుగా జరిగిన ఈ పరిణామానికి గంగవెర్రులెత్తిపోయాడు దొర.



## చీకటిపడ్డాక

పగలంతా సూర్యుడు
బల్లేలు విసురుతూనే వున్నాడు.
భూమీ ఆకాశం
గాలీ నీరూ
యుద్ధం చేసి చేసి అలసిపోయాయి.
రోజంతా బాధ్యతా బంధితుడినై
నేనూ అలాగే అలసిపోతాను.

సాయంకాల మయ్యాక
చల్లబడుతుంది ప్రకృతి.
శిథిలలోకం పిట్టల పాటల్లో
ఎర్రటి గాయాలు కడుక్కుంటుంది.
పట్టణాల్లో ఫ్యాక్టరీలు
డ్యూటీ దిగుతాయి.
పల్లెటూళ్ళో పసుల మందలు
పిల్లలకోసం పాల పొదుగులతో
ఇంటిమొహం పడతాయి
ఊరవతల తాటి తోపుల్లో
తల దాచుకుంటాడు సూర్యుడు
ఆకాశం మబ్బు వలువలు విడిచి
నగ్నంగా నీట్లో దిగుతుంది.
భూమి నిట్టూర్పు లేచి
మొక్కల నోళ్ళతో నీళ్ళు తాగుతుంది
గాలి పూల సెంటు పూసుకుని
షికారు బయలుదేరుతుంది.
నేను వృత్తివేషం విప్పేసి
నిరలంకారంగా నేనుగా మిగులుతాను.
క్రమక్రమంగా
కనువిందు చేసే దృశ్యాలన్నీ
నిశ్శబ్దంగా నేలకు దిగే
పలచని చీకటిలో కలిసిపోతాయి.
శబ్దాలన్నీ సమసిపోయి
మౌనంలో లీనమౌతాయి.
చైతన్యం విశ్రాంతి కోరుతూ

పనులన్నీ రేపటికి వాయిదా వేస్తుంది.
భూనభోంతరాళాల్ని ఏకం చేస్తూ
నిశి నల్ల కలువలా విచ్చుకుంటుంది.
ఆ ప్రశాంత నిశా ద్వారంలో
నా ఎద కవిగా పునర్జన్మిస్తుంది.
మనసులోని మధుర భావాలు
పాటలుగా పెదవులపైకొస్తాయి.
ఆ పాటల కోటి ప్రతిధ్వనుల్లా
నింగిలో తారలు విరిసి
లోకాన్ని చల్లగా వెలిగిస్తాయి.

—కె. గోదావరి శర్మ

జీతగాళ్ళు ఆశ్చర్యంలోంచి తేరుకోలేదు.

"తుపాకితోప కాలుస్తే గాని దోవకు రారు. లమ్డీకొడుకు" అంటూ విర-విరా లోపలికి నడిచాడు దొ'ర.

గోడకు వ్రేలాడేసి వున్న తుపాకి తీసుకున్నాడు.

బయటికి వచ్చాడు. గురిచూశాడు. ఉరికి వస్తున్న అభిమానం అతణ్ని దహించివేస్తుంది.

"సంపురా! దమ్ములుంటే.... నీ దినాలు గాను" యాదయ్య పెళ్ళాం మరోసారి అరిచింది.

మరోసారి పళ్ళు పట పటలాడించాడు దొర.

కోపాన్నాపుకోలేకపోయాడు. చేతిలో ట్రిగ్గర్ పనిచేసింది. యాదయ్య గుండెను చేతిలో పట్టుకొని పెళ్ళాన్ని అలాగే వాటేసుకుని.... మోకాళ్ళమీద పడి...పిమ్మట గిర్రున వెనుకకు తిరిగి పడిపోయాడు.

"ధూ" కాండ్రించి ఊశాడు దొర.

యాదయ్య దొరమీదకు ఊయాలని అనుకున్నాడు.

బలవంతంగా ఉమ్మును నోట్లోకి తెచ్చుకున్నాడు....గుండెలో కలుక్కుమంటుంది. ఆపై శ్వాస ఆడలేదు....దమ్ము బిగపట్టడం కష్టంగా తోస్తుంటే....నోట్లోని ఉమ్ము చొంగలా కారుతుంది....సత్తువ సన్నగిల్లిపోయింది. పెళ్ళాం ఎప్పుడో .... నోరు తెరచి....అలాగే దాటిపోయింది. మీదున్న ఆమెను గుండెలకు గట్టిగా హద్దుకున్నాడు.

కడుపులో పెల్లుబుకుతున్న కోపాగ్నికి ఏ రూపం కలుగకుండానే మొహం వెలవెలాబోయింది.

"బాడుకవుగాళ్ళను గడీ అవుతలికి ఈడ్వండిరా!" జీతగాళ్ళు రెండు శవాల్ని బయటికి ఈడ్చారు.

చీకటిపడిపోయింది.

ఎక్కడో కోళ్ళు బెకబెకలాడుతున్న శబ్దం.

తమవాళ్ళు ఇద్దరు దారుణ కృత్యానికి ఆహుతైపోయినా తక్కిన వాళ్ళెవరూ నోరు విప్పలేదు.

కాని వాళ్ళలో ఆవేదన దావాగ్నిలా దహించివేస్తూంది. ●

ఎమెస్కో వారి
సంక్రాంతి కానుక
యద్దనపూడి సులోచనారాణి
నవలా కుసుమం
ప్రేమదీపిక
వెల.రూ.15-లే
విడుదలైంది!
మీ దగ్గరలో వున్న పుస్తక విక్రేతను అడుగండి. లేదంటే తెప్పించి పెట్టమనండి. వీలుకాకపోతే రూ.5/-లు ఎమ్.ఓ. చేస్తే మిగతా రూ.10/-లకి వి.పి. పెట్టి పంపిస్తాము.
* ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ * 3237 రాష్ట్రపతి రోడ్ సికింద్రాబాద్-500003 *